# సాక్షి అనంతపురం

మంగళవారం । 4 । ఏప్రిల్ । 2023






## చీనీ టన్ను రూ.30 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.30 వేలు పలికాయి.



## టమాట కిలో రూ.12

కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.12, కనిష్టంగా రూ.3, సరాసరిన రూ.6 పలికింది.

గరిష్టం/కనిష్టం
40.7°/22.8°

జిల్లా అంతటా సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉక్కపోత కొనసాగుతోంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది.




పాలనా సౌలభ్యం, ప్రజలకు సేవలను మరింత చేరువ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల పునర్విభజన చేసింది. ఎనిమిది నియోజకవర్గాలతో ఏర్పాటైన 'అనంత' ఏడాది వ్యవధిలోనే విద్య, వైద్యం, వ్యవసాయ, ఉద్యానం తదితర అన్ని రంగాల్లోనూ అద్భుతమైన ప్రగతి సాధించింది. నలుమూలల నుంచి రెండు గంటల్లోపే జిల్లా కేంద్రానికి చేరుకునే సౌలభ్యం ఏర్పడింది.



# అనంత ప్రగతి

- జిల్లా పునర్విభజనకు ఏడాది పూర్తి
- ఎనిమిది నియోజకవర్గాలతో నూతన 'అనంత'
- సచివాలయ వ్యవస్థతో ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు

**అనంతపురం:** సరిగ్గా గత ఏడాది ఏప్రిల్ 4న ఉమ్మడి అనంతపురం జిల్లా రెండుగా విడిపోయింది. అనంతపురం జిల్లాలో 31 మండలాలు, 8 అసెంబ్లీ నియోజకవర్గాలు, 503 గ్రామాలు ఉన్నాయి. 32 మండలాలు, ఆరు నియోజకవర్గాలతో శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి కేంద్రంగా అవతరించింది. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా అధికారులు పాలనాపరమైన ఏర్పాట్లు చేశారు. విస్తీర్ణం బాగా తగ్గిపోవడంతో ప్రజలకు పాలన మరింత చేరువైంది. అధికారులు సంక్షేమ పథకాల ఫలాలను సులువుగా ప్రజల దరి చేర్చేందుకు అవకాశం కలిగింది.

### పేదలందరికీ ఇళ్లు

వైఎస్సార్ గృహ నిర్మాణ పథకం కింద గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో రూ.1,272 కోట్లతో 70,720 గృహ నిర్మాణాలు చేపట్టారు. వైఎస్సార్ జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాల్లో భాగంగా రూ.118 కోట్లు కేటాయించారు. ఏపీ టిడ్కో ద్వారా రూ.576.88 కోట్లతో 12,96,000 ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. టిడ్కో లేఅవుట్లలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు రూ.95 కోట్లు వ్యయం చేయనున్నారు.



- వైఎస్సార్ రైతు భరోసా – పీఎం కిసాన్ కింద ప్రతి రైతు కుటుంబానికీ రూ.13,500 చొప్పున రూ.320.41 కోట్లు నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేశారు.

### శాశ్వత భూహక్కు, భూరక్ష..

వందేళ్ల తరువాత గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వ్యవసాయ, వ్యవసాయేతర, గ్రామకంతం స్థిరాస్తులను సర్వే చేయించి భూమి హక్కుదారులకు శాశ్వత భూహక్కు పత్రాలు అందించే కార్యక్రమం రూ.1000 కోట్ల వ్యయంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. జిల్లాలోని 503 గ్రామాలకు గాను 105 గ్రామాల్లో డ్రోన్ ద్వారా సర్వే చేశారు. అందులో 44 గ్రామాలకు 13 నోటిఫికేషన్లు జారీ చేశారు. ఆ గ్రామాల్లో 1,44,484 ఎకరాల విస్తీర్ణంలో డ్రోన్ ద్వారా 33,199 ల్యాండ్ మ్యాప్స్ రూపకల్పన పూర్తయింది. ఈ పథకం ద్వారా ఒక్కొక్క రైతుకు భూకమతం ఏర్పాటు కావడంతో పాటు ఒక భూకమత పటం ఇవ్వనున్నారు. అన్ని గ్రామ పంచాయతీల్లోనూ గ్రామకంతం పరిసరాల్లో రీ సర్వే చేయించి, ప్రతి ఒక్కరికీ యాజమాన్యపు హక్కు పత్రాలను అందజేయనున్నారు.

### గ్రామ స్వరాజ్యంలో అగ్రస్థానం

గ్రామస్వరాజ్యంలో భాగంగా సచివాలయాల ద్వారా సంక్షేమ ఫలాలు, ప్రభుత్వ సేవలను గడపగడపకూ చేరుస్తోంది. జిల్లాలో ఇప్పటి వరకు ఈ–సర్వీసెస్ ద్వారా 8,34,822 మంది లబ్ధిదారులకు 29 ప్రభుత్వ శాఖలకు చెందిన 530 రకాల సేవలను అందించి రాష్ట్రంలోనే అనంతపురం జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా మంచినీటి సరఫరా నిర్వహణకు రూ.6 కోట్లు మంజూరైంది. రూ.3.98 కోట్లు ఖర్చు చేసి 48 ఆర్ఓ ప్లాంట్‌లు మంజూరు చేశారు. తాగునీటి బోర్లు, పైప్‌లైన్లు, డ్రెయినేజీ నిర్మాణాలకు రూ.3.31 కోట్లు ఖర్చు చేశారు. సిమెంట్ రోడ్లు, కల్వర్టులు వంటి 125 రకాల పనులకు రూ.7.13 కోట్లు వెచ్చించారు.

### పరిశ్రమలకు దన్ను

జిల్లాలో 2,787 సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను స్థాపించడానికి రూ.229 కోట్ల పెట్టుబడి వెచ్చించారు. వైఎస్సార్ బడుగు వికాసం కింద ఎస్సీ, ఎస్టీ పారిశ్రామిక వేత్తలు స్థాపించిన 166 యూనిట్లకు రూ.18.46 కోట్ల రాయితీ ఇచ్చారు.

- ముఖ్యమంత్రి అభివృద్ధి నిధి పథకం కింద ప్రతి నియోజకవర్గానికీ రూ.2 కోట్ల చొప్పున రూ.16 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. అనంతపురం పార్లమెంటరీ నియోజకవర్గ నిధుల కింద రూ.8.31 కోట్లు ఖర్చుచేశారు.

### బడులకు నూతన రూపు

మన బడి నాడు–నేడు కింద ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయి. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా సదుపాయాలు కల్పించారు. జిల్లాలో రెండో విడతగా 1,103 ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి రూ.386 కోట్లు ఖర్చు చేశారు. 401 పాఠశాలల్లో 538 అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టారు. నాడు–నేడు కింద ఆరోగ్య కేంద్రాల మరమ్మతులకు రూ.39.67 కోట్లు ఖర్చు చేశారు. రూ.73 కోట్లతో 9 కమ్యూనిటీ హెల్త్‌సెంటర్లు, రూ.13.35 కోట్లతో ఒక ఏరియా హాస్పిటల్‌ను అభివృద్ధి చేస్తున్నారు.

### చదువులకు ఎనలేని సాయం

'అమ్మ ఒడి' కింద జిల్లాలో 1 నుంచి 12వ తరగతి విద్యార్థులకు రూ.15 వేల చొప్పున రూ.325.26 కోట్లు నేరుగా 2,16,842 మంది తల్లుల ఖాతాల్లో జమ చేశారు. 8వ తరగతి విద్యార్థులు, ఉపాధ్యాయులకు బైజూస్ కంటెంట్‌తో కూడిన 25,920 ట్యాబ్‌లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఫీజు రీయింబర్స్ మెంట్ కింద రూ.137 కోట్లు అందించింది.

### ఆరోగ్యసిరి

వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా 3,255 చికిత్సలకు ఉచిత వైద్య సేవలు అందించారు. 42,029 మందికి వైద్య సేవలు అందించి రూ.91.51 కోట్లు ఖర్చు చేశారు. వైఎస్సార్ ఆరోగ్య ఆసరా కింద 23,120 మందికి రూ.15.02 కోట్లు చెల్లించారు. విలేజ్ క్లినిక్‌ల ద్వారా 71,989 సేవలు అందించారు.

### శిశుమరణాల నివారణే లక్ష్యం

జిల్లాలో 2,302 అంగన్‌వాడీ కేంద్రాల్లో 1,54,802 మందికి రూ.45.43 కోట్ల పౌష్టికాహారాన్ని అందించారు. శిశుమరణాల నివారణకు, పోషకాహార లోపం కలగకుండా పిల్లలకు ప్రత్యేక పోషణ, హైరిస్క్ గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై నిరంతర పర్యవేక్షణ, వైద్య సేవలు అందేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

### దూరాభారం బాగా తగ్గింది



పాలనా వికేంద్రీకరణతో అధికారులు ఇపుడు ప్రతి సమస్యనూ దగ్గరగా తెలుసుకుంటున్నారు. రాష్ట్రంలోనే అతి పెద్దదైన అనంతపురం జిల్లా వికేంద్రీకరణ కాకపోతే మడకశిర ప్రాంతంలో ఉంటున్న వారు ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి వెళ్లడానికి ఎన్నో సమస్యలు ఎదురయ్యేవి. పాలనా సౌలభ్యం కోసం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అభినందనీయం. ఈ రోజు సామాన్యులు కూడా ప్రభుత్వానికి దగ్గరయ్యే అవకాశం వచ్చింది.

– డాక్టర్ పతికి రమేష్ నారాయణ, విశ్రాంత ప్రిన్సిపాల్, బహుగ్రంథ రచయిత

### క్షేత్రస్థాయి పరిశీలనకు ఆస్కారం



జిల్లాల పునర్వ్యవస్థీకరణ నేపథ్యంలో మండలాల సంఖ్య తగ్గింది. జిల్లా స్థాయి అధికారులు సైతం క్షేత్రస్థాయిలోని అంశాలను పరిశీలన చేయడానికి ఆస్కారం ఏర్పడింది. అధికారులతో సమన్వయం చేసుకోవడానికి, వారు జిల్లా స్థాయి అధికారులను నేరుగా కలవడానికి దోహదపడుతోంది. సమస్యలకు తక్షణ పరిష్కారం లభిస్తోంది.

– ఐ. నరసింహా రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ,

### వికేంద్రీకరణ గొప్ప నిర్ణయం



ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలలో సచివాలయ వ్యవస్థ, జిల్లాల పునర్వ్యవస్థీకరణ ప్రజలకు ఎంతో మేలు చేసేవి. ప్రభుత్వ సేవలు ప్రజలకు అందుబాటులో రావడానికి వికేంద్రీకరణ అత్యంత ముఖ్యం. ఎప్పుడో 20 ఏళ్ల కిందట జరగాల్సిన నిర్ణయం ఇప్పుడైనా నెరవేరడం ఆనందకరమే. దీనివల్ల అధికారులు ప్రజలకు మరింత చేరువగా ఉంటున్నారు.

– డాక్టర్ ఎస్.ఎస్.గిరిధర ప్రసాద్‌రాయ్, చరిత్ర పరిశోధకులు, అనంతపురం

## న్యూస్‌రీల్

### 'స్పందన'పై భరోసా ఇవ్వాలి



ఉపకరణాలు అందుకున్న దివ్యాంగులతో కలెక్టర్ నాగలక్ష్మి

**అనంతపురం సిటీ/ శ్రీకంఠం సర్కిల్:** 'స్పందన'లో ప్రజలు ఇచ్చే అర్జీలను పరిష్కరించి భరోసా కల్పించాలని కలెక్టర్ నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి నేరుగా పర్యవేక్షించే 'స్పందన' అర్జీలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో సోమవారం నిర్వహించిన 'స్పందన'లో అధికారులతో కలిసి ప్రజల నుంచి వివిధ సమస్యలపై 283 అర్జీలు స్వీకరించారు. అనంతరం అన్ని శాఖల అధికారులనుద్దేశించి కలెక్టర్ మాట్లాడారు. అర్జీదారులతో మాట్లాడి, వారికి సంతృప్తికర పరిష్కారం చూపాల్సిందేనని స్పష్టం చేశారు. కార్యక్రమానికి డీఆర్ఓ గాయత్రీదేవి, అసిస్టెంట్ సీఈఓ గుత్తా కేశవ నాయుడు, ఆర్డీఓ మధుసూదన్, ఇతర అన్ని శాఖల అధికారులు హాజరయ్యారు.

**కృత్రిమ అవయవాల అందజేత**

వివిధ ప్రతిభావంతులకు అవసరమైన కృత్రిమ అవయవాలను కలెక్టర్ అందజేశారు. రెవెన్యూ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె దివ్యాంగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం 25 మంది విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులకు 17 కృత్రిమ అవయవాలు, 5 ఊత కర్రలు, 3 క్యాలిపర్లు అందజేశారు. వికలాంగుల సంక్షేమ శాఖ ఏడీ రసూల్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

- అనంత రైతుకు బాసటగా నిలవడంలో ఉద్యాన శాఖ, ఏపీఎంఐపీలు ముందున్నాయని కలెక్టర్ కొనియాడారు. డ్రిప్పులు, స్ప్రింకర్ల పంపిణీలో జిల్లా రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిందన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యానశాఖ అధికారి బి.రఘునాథరెడ్డి, ఏపీఎంఐపీ ఏడీ ఫిరోజ్ ఖాన్‌లు కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

### భూసార పరీక్షలకు సిద్ధం



మట్టి పరీక్షల గురించి తెలుసుకుంటున్న డీఏఓ

**అనంతపురం అగ్రికల్చర్:** వేసవిలో భూసార పరీక్షల నిర్వహణకు సిద్ధం కావాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి (డీఏఓ) బి.చంద్రా నాయక్ ఆదేశించారు. నగరంలోని భూసార పరీక్షా కేంద్రం (సాయిల్ టెస్టింగ్ ల్యాబొరేటరీ–ఎస్‌టీఎల్)లో ఏడీఏ ఎల్.రోజాపుష్పలత ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి అగ్రికల్చర్ ల్యాబ్ ఏఓలు, సిబ్బందికి రెండు రోజుల శిక్షణ సోమవారం ప్రారంభమైంది. డీఏఓ చంద్రా నాయక్ మాట్లాడుతూ వేసవిలో రైతుల పొలాల్లో మట్టిని సేకరించి నియోజకవర్గ స్థాయి ల్యాబ్‌లు, జిల్లాస్థాయి ల్యాబ్‌లో పరీక్షలు నిర్వహించాలన్నారు. పోషకాల విశ్లేషణ గురించి వివరించేందుకు టెక్నికల్ ఏఓలు ఆదిలక్ష్మి, రుమానాబేగం మాస్టర్ ట్రైనీలుగా వ్యవహరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ ఏఓలు, టెక్నికల్ ఏఓలు, అగ్రిల్యాబ్ సిబ్బంది పాల్గొన్నారు.

### జెడ్పీ డిప్యూటీ సీఈఓగా అమృతరాజు



**అనంతపురం సిటీ:** జిల్లా పరిషత్ కార్యాలయ గణాంకాధికారి ఎండీ అమృతరాజును డిప్యూటీ సీఈఓగా నియమిస్తూ కలెక్టర్ నాగలక్ష్మి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఇప్పటి వరకూ ఆ హోదాలో పనిచేసిన జల్ల శ్రీనివాసులు మంగళవారం రిలీవ్ కానున్నారు. కాగా, పనితీరులో నిబద్ధత కలిగిన అమృతరాజ్.. కర్నూలు జిల్లా వాసి. 2007లో అదే జిల్లాలోని పెద్దకడబూరు ఎంపీడీఓగా తొలి పోస్టింగ్ అందుకున్నారు. ఆ తర్వాత డోన్, ప్యాపిలి, పెనుకొండ, నార్పల, రామగిరి, గుత్తి, ఉరవకొండ ఎంపీడీఓగా పనిచేశారు. విధుల నిర్వహణలో ఆయన కనబరచిన చిత్తశుద్ధికి రాష్ట్ర, జిల్లా స్థాయిలో తొమ్మిది పురస్కారాలు దక్కాయి. ప్యాపిలిలోని బాలికల ఉన్నత పాఠశాలను దత్తత తీసుకుని మోడల్‌గా తీర్చిదిద్దారు. త్వరలో డిప్యూటీ సీఈఓ బాధ్యతలు స్వీకరించనున్నారు.

# ప్రశాంతంగా పది పరీక్షలు





అనంతపురంలోని ఓ పరీక్ష కేంద్రంలో ఓఎంఆర్ షీట్లు అందజేస్తున్న దృశ్యం రాజేంద్ర మునిసిపల్ హైస్కూల్‌లో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

**రాప్తాడు రూరల్ :** పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు జిల్లాలో తెలుగు పరీక్ష ప్రశాంతంగా జరిగిందని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. ఎక్కడా మాల్ ప్రాక్టీసు ఘటనలు చోటు చేసుకోలేదన్నారు. అనంతపురంలోని రాజేంద్ర నగరపాలక ఉన్నత పాఠశాల కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. పరీక్షల నిర్వహణ కోసం 2,094 మంది ఇన్విజిలేటర్లు, 7 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించామన్నారు. పదో తరగతిలో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు జిల్లాలో 'అనంత సంకల్పం' కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈసారి మంచి ఫలితాలు సాధించగలమన్న ఆశాభావం వ్యక్తం చేశారు. కలెక్టర్ వెంట అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్, డీఈఓ సాయిరామ్ ఉన్నారు.

### 391 మంది విద్యార్థుల గైర్హాజరు

తెలుగు పరీక్షకు జిల్లాలో 391 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 139 కేంద్రాల్లో 30,693 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 30,302 మంది రాశారు.

### చేయివిరిగినా పరీక్షకు హాజరు

**బెళుగుప్ప:** వై.రాంపురం జెడ్పీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి యశ్వంత్ ఆదివారం రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. కుడి చేయి విరగడంతో కట్టుకట్టించుకున్నాడు. సోమవారం బెళుగుప్పలోని శ్రీనివాస విద్యానికేతన్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రానికి కట్టుతోనే తెలుగు పరీక్షకు హాజరయ్యాడు. అధికారులు తొమ్మిదో తరగతి చదువుతున్న సంధ్య స్క్రైబ్(సహాయకారి) ద్వారా యశ్వంత్ పరీక్ష రాయించారు.







అనంతపురం వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆశీర్వాదం తీసుకుంటున్న విద్యార్థిని, బెళుగుప్పలో కట్టుకట్టుకుని పరీక్షకు వచ్చిన విద్యార్థి, రాజేంద్ర హైస్కూల్‌లో కలెక్టర్, డీఈఓ పరిశీలన

# సహాయకుల అవసరం లేకుండా పరీక్షలు

**రాప్తాడు:** అంధ విద్యార్థులు ఏ పరీక్ష రాయాలన్నా సహాయకులు అవసరం. సహాయకులు ప్రశ్నలను చదివి వినిపిస్తే, వాటికి అంధ విద్యార్థులు సమాధానాలు చెబితే సహాయకులు తిరిగి రాసేవారు. ఈసారి దేశంలోనే తొలిసారిగా సహాయకుల అవసరం లేకుండా ఏపీలోని అనంతపురం జిల్లా రాప్తాడు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ల్యాప్‌టాప్ సహాయంతో అంధ విద్యార్థులు పదో తరగతి తెలుగు పరీక్ష రాశారు. ఆర్డీటీ అంధుల పాఠశాలలోని ఆరుగురు బాలికలు చైత్రిక, శ్రీధాత్రి, సౌమ్య, నాగరత్నమ్మ, దివ్యశ్రీ, పావని ల్యాప్‌టాప్‌లో ఉన్న ప్రశ్నపత్రాన్ని హెడ్‌ఫోన్ల ద్వారా విని, విద్యార్థులు జవాబును టైప్ చేశారు. సాంకేతిక సమస్యల కారణంగా ప్రశ్నలు వినిపించకపోతే ప్రశ్నలు చదివి వినిపించేందుకు రీడర్లను సైతం ఏర్పాటు చేశారు. ల్యాప్‌టాప్ ద్వారా జవాబులను ప్రింట్ తీసి ఓఎంఆర్ షీట్‌కు జత చేశారు.



ల్యాప్‌టాప్ ద్వారా పరీక్ష రాస్తున్న అంధ విద్యార్థులు

### కొత్త అనుభవం కలిగింది



మా సీనియర్లు గతంలో సహాయకుల సాయంతో పరీక్షలు రాసేవాళ్లు. మేము మొదటిసారిగా ల్యాప్‌టాప్ సాయంతో డిజిటల్ విధానంలో పరీక్షలు రాస్తున్నాం. ఇది మాకు కొత్త అనుభవం. ఇందుకు మా ఉపాధ్యాయుల సహకారం మరువలేనిది. మూడు నెలలపాటు మా పాఠశాలలో శిక్షణ ఇచ్చారు. ఫస్ట్ రోజు కదా కాస్త భయపడ్డాం. అయినా తెలుగు పరీక్ష బాగా రాశాం. మిగిలిన పరీక్షలు కూడా భయం లేకుండా రాస్తాం.

– నాగరత్నమ్మ, అంధ విద్యార్థి, ఆర్డీటీ అంధుల పాఠశాల, రాప్తాడు

# ఒక ప్రశ్నపత్రం బదులు మరొకటి

**రాప్తాడురూరల్:** అనంతపురంలోని భాష్యం పాఠశాల కేంద్రంలో ఇడిగొట్టు నందిని అనే విద్యార్థినికి, సీవీఆర్ స్కూల్ కేంద్రంలో పోలేపల్లి జశ్వంత్ అనే విద్యార్థికి తెలుగు ప్రశ్నపత్రం బదులుగా తెలుగు కాంపోజిట్ ప్రశ్నపత్రం ఇచ్చారు. పరీక్ష అనంతరం ఇళ్లకు వెళ్లి విషయం చెప్పడంతో సదరు విద్యార్థులతో పాటు కుటుంబ సభ్యులు డీఈఓ సాయిరామ్‌ను కలిసి గోడు వెళ్లబోసుకున్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి విద్యార్థులకు న్యాయం జరిగేలా చూస్తామని డీఈఓ హామీ ఇచ్చారు.

### ఇద్దరు ఇన్విజిలేటర్ల సస్పెన్షన్

అనంతపురం నగరంలో రెండు కేంద్రాల్లో తెలుగు పరీక్షకు బదులుగా తెలుగు కాంపోజిట్ ప్రశ్నపత్రాలు ఇచ్చిన ఇద్దరు ఇన్విజిలేటర్లపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ ఘటనపై విచారణకు ఆదేశించిన డీఈఓ సాయిరామ్ నివేదిక ఆధారంగా భాష్యం స్కూల్‌లో ఇన్విజిలేటర్ హెచ్.నాగవేణి, సీవీఆర్ స్కూల్ కేంద్రంలో ఇన్విజిలేటర్ పీవీ నాగభూషణను సస్పెండ్ చేశారు. ఈ రెండు సెంటర్లలోని చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులకు చార్జెస్ ఫ్రేమ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

### 'ఓపెన్' పరీక్షల్లో ఆరుగురు టీచర్ల సస్పెన్షన్

సార్వత్రిక విద్యా పీఠం (ఓపెన్ స్కూల్) పరీక్షల్లో ఆరుగురు టీచర్లను సస్పెండ్ చేశారు. ఆర్జేడీ ప్రతాప్ రెడ్డి నగరంలోని నేతాజీ, పొట్టిశ్రీరాములు, శారద బాలికల ఉన్నత పాఠశాల కేంద్రాలను తనిఖీలు చేశారు. ఆయా సెంటర్లలో పరీక్షలు రాస్తున్న అభ్యర్థులకు చెందిన మొబైళ్లు ఉన్నట్లు గుర్తించి బాధ్యులైన ఇన్విజిలేటర్లు బాబురావు, చితంబర రెడ్డి, పి.నాగరాజును సస్పెండ్ చేయాలని డీఈఓను ఆదేశించారు. డీఈఓ సాయిరామ్ పొట్టిశ్రీరాములు, శారద బాలికల పాఠశాల కేంద్రాలను పరిశీలించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇన్విజిలేటర్లు వై.శివమ్మ, ఎస్.రాజన్న, సి.గంగిరెడ్డిని సస్పెండ్ చేశారు.

### అక్రమాలకు పాల్పడితే చర్యలు : ఎస్పీ

**అనంతపురం శ్రీకంఠంసర్కిల్:** నగరంలోని భాష్యం పాఠశాలలో జరుగుతున్న పదో తరగతి పరీక్షల తీరును ఎస్పీ ఫక్కీరప్ప పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా పదో తరగతి పరీక్షలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశామన్నారు. కేంద్రాలకు సమీపంలోని ప్రతి జిరాక్స్ సెంటరునూ మూసివేయించామన్నారు. ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేకుండా పకడ్బందీగా విద్యార్థులను తనిఖీ చేసి పంపుతున్నామన్నారు. మాస్ కాపీయింగ్, మాల్ ప్రాక్టీస్, తదితర అక్రమాలకు పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఇప్పటికే విద్యార్థులను హెచ్చరించినట్లు తెలిపారు.

# భార్యను కొట్టి... ట్రాన్స్‌ఫార్మర్ పట్టుకుని!

**కళ్యాణదుర్గం:** భార్యతో గొడవపడిన ఓ యువకుడు క్షణికావేశంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పట్టుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. పోలీసులు తెలిపిన మేరకు.. కళ్యాణదుర్గంలోని శంకరప్ప తోట కాలనీకి చెందిన బోయ నరసప్ప, మమత దంపతులు. వీరికి ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. దినసరి కూలీగా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకునే నరసప్ప... ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. రోజూ మద్యం మత్తులో ఇంటికి చేరుకుని భార్యతో గొడవపడేవాడు. ఈ క్రమంలోనే సోమవారం ఉదయం మద్యం మత్తులో భార్యతో గొడవపడి చేతికి అందిన పూలకుండీని ఆమెపై విసిరాడు. దీంతో మమత తలకు తీవ్ర గాయమైంది. ఘటనతో భయపడిన నరసప్ప ఇంటి నుంచి బయటకు వచ్చి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పట్టుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. ఒక్కసారిగా విద్యుత్ షాక్‌కు గురై కుప్పకూలాడు. గమనించిన బంధువులు వెంటనే కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచనతో మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# పింఛన్ల పంపిణీ ప్రారంభం

**అనంతపురం:** వైఎస్సార్ పింఛన్ కానుక పథకం కింద జిల్లా వ్యాప్తంగా సోమవారం పింఛన్ల పంపిణీ ప్రారంభమైంది. రెండు రోజులు బ్యాంకులకు సెలవులు రావడంతో ప్రభుత్వం సోమవారం సచివాలయ సిబ్బంది ఖాతాలలో డబ్బు జమ చేసింది. దీంతో సచివాలయ సిబ్బంది బ్యాంకుల నుంచి డబ్బు డ్రా చేసుకుని పంపిణీ ప్రారంభించారు. జిల్లాలో 2,75,602 మంది పింఛన్‌దారులు ఉండగా.. ప్రభుత్వం రూ.76,98,96,250 నగదు కేటాయించింది.



అనంతపురం ఒకటో డివిజన్‌లో వార్డు వలంటీర్ శ్రావణి చేతుల మీదుగా పింఛన్ అందుకుంటున్న అబ్దుల్ మునీఫ్



అనంతపురంలో గాజుల అరుణకు పింఛన్ అందజేస్తున్న వార్డు వలంటీర్ ఆనంద్

## క్లుప్తంగా

### ప్రాణాలు బలిగొన్న అతి వేగం


వంశి (ఫైల్)


మల్లికార్జున

విడపనకల్లు: అతి వేగం ఓ విద్యార్థి ప్రాణాలను బలిగొంది. మరో విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు... విడపనకల్లు మండలం హావళిగి గ్రామానికి చెందిన వంశి (16), మల్లికార్జున ఇద్దరూ పదో తరగతి కంపార్ట్‌మెంట్ పరీక్షలు రాస్తున్నారు. ఈ నెల 10, 13 తేదీల్లో వీరు పరీక్ష రాయాల్సి ఉంది. ఈ క్రమంలో తమకు కేటాయించిన పరీక్ష సెంటర్‌ను చూసేందుకు సోమవారం ఉదయం ద్విచక్ర వాహనంపై విడపనకల్లులోని ఆదర్శ పాఠశాలకు బయలుదేరారు. వేగంగా దూసుకెళుతున్న విద్యార్థులు విడపనకల్లు – ఆదర్శ పాఠశాల మధ్యకు చేరుకోగానే ఎదురుగా అంతే వేగంతో వాహనాన్ని ఓవర్‌టేక్ చేసి వచ్చిన కారును ఢీకొన్నారు. ఘటనలో రెండు వాహనాలు నుజ్జునుజ్జ య్యాయి. తలకు బలమైన గాయం కావడంతో వంశీ కోమాలోకి వెళ్లాడు. మల్లికార్జునకు కుడికాలు విరిగింది. క్షతగాత్రులను స్థానికులు వెంటనే 108 అంబులెన్స్ ద్వారా ఉరవకొండలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వంశీని బెంగళూరుకు, మల్లికార్జునను తిరుపతికి తరలించారు. కాగా, బెంగళూరులోని ఆస్పత్రిలో చికిత్సకు స్పందించక వంశీ మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. ఘటనపై విడపనకల్లు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# శుద్ధజలం .. ఆరోగ్యానికి బలం

- అంగన్‌వాడీ కేంద్రాల్లో మినీ ఆర్వోప్లాంట్ల ఏర్పాటు
- శాశ్వత భవనాలున్న వాటికి తొలి ప్రాధాన్యత
- జిల్లాలోని 283 కేంద్రాలకు అవకాశం
- 119 కేంద్రాల్లో పూర్తయిన పనులు


అంగన్‌వాడీ కేంద్రంలో విద్యాభ్యాసం చేస్తున్న చిన్నారులు


నీటిని సద్వినియోగం చేసుకుంటున్న లబ్ధిదారులు

రాయదుర్గం: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం సమూల మార్పులకు శ్రీకారం చుట్టింది. మాతాశిశు సంరక్షణ కోసం వైఎస్సార్ సంపూర్ణ పోషణ, పోషణ ప్లస్ పథకాలతో పాటు ఫోర్టిఫైడ్ బియ్యం అందించడం లాంటి కార్యక్రమాలను పక్కాగా అమలు చేస్తోంది. ఈ క్రమంలోనే తల్లులు, చిన్నారుల సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ అంగన్‌వాడీ కేంద్రాల్లో మినీ ఆర్వోప్లాంటు్లు ఏర్పాటు చేస్తోంది. 15 లీటర్ల సామర్థ్యం గల ప్లాంటు ఏర్పాటుకు రూ. 24 వేలు ప్రభుత్వం వెచ్చిస్తోంది. ఈ ప్లాంటు గంటకు 12 లీటర్ల నీటిని శుద్ధి చేస్తుంది. మధ్యాహ్న భోజన సమయాన శుద్ధ జలంతో లబ్ధిదారుల ఆరోగ్యం కాపాడడమే లక్ష్యంగా ఈ బృహత్తర కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని అధికారులు తెలిపారు

**జిల్లాలో 283 ఆర్వో ప్లాంట్ల ఏర్పాటు..**

జిల్లాలో 11 ఐసీడీఎస్ ప్రాజెక్టులుండగా, వాటి కింద 2,302 అంగన్‌వాడీ కేంద్రాలు కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయి. వీటిల్లో 1,043 కేంద్రాలకు పక్కభవనాలు ఉండగా, 948 అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఉచిత అద్దె కేంద్రాలు 311 చోట్ల ఉన్నాయి. మొదటి విడతగా 283 మినీ ఆర్వో ప్లాంట్లు మంజూరు కాగా, ఇప్పటికే 119 కేంద్రాల్లో ఏర్పాటు కూడా చేశారు. త్వరలో అన్ని కేంద్రాల్లో ఏర్పాటు చేస్తామని ఐసీడీఎస్ అధికారులు తెలిపారు.

| | |
|---|---|
| జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలు | 2,302 |
| పక్కా భవనాలు | 1,043 |
| అద్దె భవనాలు | 948 |
| ఉచిత భవనాలు | 311 |
| మొదటి విడతలో మంజూరైన | |
| మినీ ఆర్వో ప్లాంట్లు | 283 |
| ఇప్పటి వరకు ఏర్పాటైనవి | 119 |

**టీడీపీ హయాంలో అధ్వాన పరిస్థితులు..**

టీడీపీ హయాంలో అంగన్‌వాడీ కేంద్రాలు అధ్వాన స్థితిలో ఉండేవి. సౌకర్యాల మాట అటుంచితే, గుక్క పట్టి అరిచే పిల్లోడికి సైతం గ్లాసు నీరివ్వలేని పరిస్థితి. చేతిబోర్లు, పంచాయతీ కుళాయి నీరు కూడా అరకొరగా అందేవి. ఇప్పుడా పరిస్థితులు అసలు కనిపించడం లేదు. పూర్వ ప్రాథమిక విద్య బలోపేతం మొదలు, పౌష్టికాహారం అందజేయడం, మినీ ఆర్వో ప్లాంట్ల దాక ఎన్నో మార్పులు చూస్తున్నామని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

### చాలా సంతోషంగా ఉంది



అంగన్‌వాడీ కేంద్రంలో విద్యతో పాటు సౌకర్యాలు కూడా మెరుగయ్యాయి. ప్రస్తుతం మినీ ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేసి శుద్ధ జలం అందజేస్తున్నారు. మధ్యాహ్న భోజన సమయాన ఈ నీరు ఎంతో ఉపశమననిస్తున్నాయి. గతంలో ఇలాంటి పరిస్థితులు చూడలేదు. పిల్లలే కాదు, బాలింతలు, గర్భిణులకు నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తున్నారు. చాలా సంతోషంగా ఉంది.

– తులసి, గర్భిణి, సోమలాపురం, డీ హీరేహాళ్ మండలం

### దశల వారీగా అన్ని కేంద్రాల్లో ఏర్పాటు



జిల్లాలో సొంత భవనాలున్న కేంద్రాలపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. మొదటి విడతలో 283 ఆర్వో ప్లాంట్లు మంజూరయ్యాయి. వాటిలో ఇప్పటికే 119 చోట్ల అమర్చారు. మిగిలినవి కూడా త్వరలో ఏర్పాటు చేస్తాం. 15 లీటర్ల సామర్థ్యం గల ప్లాంటు ఏర్పాటుకు రూ. 24 వేలు కేటాయించారు. ఇది గంటకు 12 లీటర్ల నీటిని శుద్ధి చేస్తుంది. లబ్ధిదారుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్ద పీట వేస్తున్నాయి. దశలవారీగా అన్ని కేంద్రాల్లో ఏర్పాటు చేస్తాం.

– శ్రీదేవి, ఐసీడీఎస్ పీడీ, అనంతపురం

### టీడీపీ మహిళా కార్యకర్త చేతివాటం

- స్త్రీనిధి సొమ్ము స్వాహా
- న్యాయం చేయాలంటూ అధికారులకు మహిళల ఫిర్యాదు


యానిమేటర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్న మహిళా సంఘాల ప్రతినిధులు

ఉరవకొండ: గ్రామైక్య సంఘం నిర్వహణలో అక్రమాలకు తావిస్తూ అందిన కాడికి స్త్రీనిధి సొమ్మును దోచుకున్న టీడీపీ మహిళా కార్యకర్తపై తక్షణ చర్యలు తీసుకోవాలంటూ మహిళా సంఘాల ప్రతినిధులు సోమవారం ఉరవకొండ ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. యానిమేటర్‌గా పనిచేస్తున్న ఉరవకొండకు చెందిన టీడీపీ కార్యకర్త రషీదా.. తమను మోసం చేసిందని వాపోయారు. 2016 నుంచి స్త్రీనిధి ద్వారా రుణాలు తీసుకుని సక్రమంగా చెల్లిస్తున్నా... ఆ డబ్బును వీఓకు చెల్లించకుండా రషీదా స్వాహా చేసిందన్నారు. ఈ లెక్కన దాదాపు రూ.2 లక్షల వరకు డబ్బు స్వాహా చేసిందని ఆరోపించారు. స్త్రీనిధి డబ్బు చెల్లించకపోవడం వల్ల తమ సంఘానికి సున్నావడ్డీ, వైఎస్సార్ ఆసరా పథకాలు అందకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్వాహా చేసిన సొమ్మును ఎలాగైనా రషీదా నుంచి రాబట్టి, తమకు న్యాయం చేయాలంటూ ఎంపీడీఓ గ్రీవెన్స్‌లో అధికారులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మహిళా సంఘం ప్రతినిధులు విజయలక్ష్మి, ఎం.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్పీ పేరు చెబితే భయపడాలా?

- అద్దె ఇంటి ఖాళీ విషయంపై యజమానిని వేధిస్తున్న కానిస్టేబుల్
- టూటౌన్ సీఐ శివరాముడి డ్రైవర్ దౌర్జన్యంపై ఎస్పీ ఫక్కీరప్పకు బాధితురాలి ఫిర్యాదు


అర్జీలు స్వీకరిస్తున్న ఎస్పీ డాక్టర్ కె. ఫక్కీరప్ప

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: 'ఎస్పీ పేరు చెబితే నేను భయపడాలా? మీ దిక్కున్న చోటుకెళ్లి చెప్పుకో, ఇల్లు ఖాళీ చేసేది లేదు! ఎస్పీ.. గిస్పీ జాన్తానై' అంటూ తాను అద్దెకుంటున్న ఇంటి యజమానిపై అనంతపురం రెండో పట్టణ సీఐ శివరాముడు డ్రైవర్ చంద్రమౌళి దౌర్జన్యానికి దిగాడు. దీంతో బాధితురాలు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్పను కలసి వినతి పత్రం అందజేసి, తన గోడు వెల్లబోసుకుంది. అనంతపురంలోని ఆశోక్‌నగర్‌లో నివాసముంటున్న వేల్పుమడుగు సునీతకు లక్ష్మీనరసయ్య కాలనీలో ఓ అపార్ట్‌మెంట్ ఉంది. అందులో ఓ ప్లాట్‌ని ఏఆర్‌పీసీ చంద్రమౌళి (ప్రస్తుతం సీఐ శివరాముడు వద్ద డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు)కి అద్దెకు ఇచ్చింది. 20 నెలలుగా అక్కడే నివాసముంటున్న చంద్రమౌళి.. సెల్లార్‌లోని పార్కింగ్ స్థలంలో ఎక్కువ వాహనాలను నిలుపుతూ మిగిలిన వారిని ఇబ్బంది పెడుతూ వచ్చేవాడు. ఈ విషయమై చంద్రమౌళిని సునీత ప్రశ్నించింది. ఆ సమయంలో ఆమెను మహిళ అని కూడా చూడకుండా అసభ్య పదజాలంతో దూషించాడు. వారించబోయిన వాచ్‌మెన్‌పై దౌర్జన్యం చేయడంతో అతను భయపడి కుటుంబంతో సహ అక్కడి నుంచి మరో ప్రాంతానికి వెళ్లిపోయాడు. దీంతో ఇల్లు ఖాళీ చేయాలని చంద్రమౌళికి సునీత సూచించింది. ఆ సమయంలో తాను ఎలాంటి పరిస్థితిలోనూ ఇల్లు ఖాళీ చేసేది లేదని, ఎస్పీతో కాకపోతే మరెవ్వరికైనా నా ఫిర్యాదు చేసుకో, భయపడేది లేదంటూ బెదిరింపులకు దిగాడు. దీంతో విసుగు చెందిన సునీత చివరకు సోమవారం ఎస్పీ ఫక్కీరప్పను కలసి చంద్రమౌళి దౌర్జన్యంపై ఫిర్యాదు చేసింది. చంద్రమౌళి నుంచి తనకు, తన తల్లిదండ్రులకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని వేడుకుంది.

**'నా బతుకుతో చెలగాటమాడారు'**

మంచి సంబంధమని పెళ్లిళ్ల పేరయ్య తెచ్చిన సంబంధాన్ని తల్లిదండ్రులు అంగీకరించి పెళ్లి చేస్తే రెండు నెలలుగా నిర్బంధంలో ఉంచి వేధించారంటూ ఎస్పీ ఎదుట ఓ వివాహిత కన్నీటి పర్యంతమైంది. ఈ మేరకు స్పందన కార్యక్రమంలో వినతి పత్రం అందజేసి, తనకు న్యాయం చేయాలని వేడుకుంది. అనంతపురం నగరానికి చెందిన బాధితురాలు తెలిపిన మేరకు... చెన్నైలో జేఏసీగా పనిచేస్తున్న రాయచోటికి చెందిన జయచంద్రతో రెండు నెలల క్రితం బాధితురాలికి వివాహమైంది. పెళ్లి సమయంలో కట్నకానుకల కింద రూ.20 లక్షల నగదు, 40 తులాల బంగారు నగలను తల్లిదండ్రులు అందజేశారు. పెళ్లికి మరో రూ.20 లక్షలు ఖర్చు చేశారు. పెళ్లైన మరుసటి రోజే అత్తమామల వద్ద ఆమెను వదిలి జయచంద్ర చెన్నైకి వెళ్లిపోయాడు. ఆ సమయంలో అత్తమామలు వేధింపులకు గురి చేస్తూ వచ్చారు. ఇతరులతో తనకు సంబంధాలు అంటగట్టి మాటలతో హింసించేవారు. ఈ విషయాన్ని భర్తకు చెబితే ఆమె వద్ద ఉన్న సెల్‌ఫోన్‌ను ధ్వంసం చేయడమే కాక ఆమెకు తెలియకుండా మెయిల్‌పెట్టి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఊడగొట్టించాడు. అతికష్టంపై వారి చెర నుంచి బయటపడి తల్లిదండ్రుల వద్దకు చేరుకున్న బాధితురాలు తనకు న్యాయం చేయాలని కోరుతూ ఎస్పీకి ఫిర్యాదు చేసింది. కాగా, పోలీసు స్పందన కార్యక్రమానికి 97 వినతులు అందగా... ఎస్పీ ఫక్కీరప్ప స్వయంగా వాటిని పరిశీలించి, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలంటూ సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఇ.నాగేంద్రుడు, తదితరులు పాల్గొన్నారు.

### ఇదెక్కడి 'చైతన్య'ం


కళ్యాణదుర్గంలోని శ్రీ చైతన్య ఈ టెక్నో పాఠశాల

కళ్యాణదుర్గం: స్థానిక శ్రీచైతన్య ఈ–టెక్నో స్కూల్ యాజమాన్య వైఖరి విద్యార్థులకు సంకటంగా మారింది. కళ్యాణదుర్గంలో తరగతులు నిర్వహిస్తూ... పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు అనంతపురంలోని కేంద్రాలకు తరలిస్తోంది. ఈ తతంగం మూడేళ్లుగా కొనసాగుతుండడం గమనార్హం.

**అంతా నిబంధనలకు విరుద్ధమే**

కళ్యాణదుర్గంలోని రాయదుర్గం ప్రధాన రహదారి పక్కనే మూడేళ్ల క్రితం శ్రీచైతన్య ఈ–టెక్నో స్కూల్‌ను ఏర్పాటు చేశారు. నర్సరీ నుంచి 7వ తరగతి వరకు తరగతులు నిర్వహించేలా విద్యాశాఖ నుంచి అనుమతులు పొందారు. ప్రస్తుతం ఈ పాఠశాలలో 600 మందికి పైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. అయితే నిబంధనలకు విరుద్ధంగా 8, 9, 10 తరగతులు నిర్వహిస్తూ అనంతపురంలోని బ్రాంచ్ ఆధ్వర్యంలో పరీక్షలకు హాజరయ్యేలా చర్యలు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది 57 మంది ఇక్కడి విద్యార్థులు అనంతపురంలోని పరీక్ష కేంద్రంలో పరీక్షలు రాసేందుకు సిద్ధమయ్యారు. పరీక్షలు ముగిసే వరకూ వారికి అనంతపురంలోని తమ బ్రాంచ్‌లో వసతి, భోజనం కల్పిస్తామంటూ నమ్మబలికారు. అయితే అక్కడ వసతులు, భోజనం సక్రమంగా లేకపోవడంతో పరీక్షలు ముగియగానే పిల్లలను ఇంటికి పిలుచుకుని వచ్చే పనిలో తల్లిదండ్రులు నిమగ్నమయ్యారు. రూ.వేలకు వేలు ఫీజులు దండుకుని చివరన ఇలా చేస్తారని అనుకోలేదని ఈ సందర్భంగా పలువురు తల్లిదండ్రులు వాపోయారు. శ్రీచైతన్య స్కూల్ యాజమాన్యం నిర్వాకంపై ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామంటూ సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు అచ్యుత్ ప్రసాద్ హెచ్చరించారు.

### హిజ్రాల అర్ధనగ్న ప్రదర్శన


కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న హిజ్రాలు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: అనంతపురం జిల్లా కలెక్టరేట్ ఎదుట సోమవారం హిజ్రాలు అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. అలాగే తమ సమస్యలపై స్పందన కార్యక్రమంలో డీఆర్‌ఓ గాయత్రీదేవికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రాయలసీమ హిజ్రాల సంఘం అధ్యక్షులు హాసినీ మాట్లాడుతూ నకిలీ హిజ్రా ఆసిఫ్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. యూనియన్‌లోని చాలా మందిని ఒంటరి చేస్తూ.. వారిపై దాడులు చేస్తూ భయాందోళనకు గురి చేస్తున్నాడన్నారు. భిక్షాటన ద్వారా వచ్చిన డబ్బును కూడా లాగేసుకుంటున్నాడని వాపోయారు. హిజ్రాలను డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిస చేసి.. వారి పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని చెప్పారు. అతనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు.

### కుందనకోట కొండల్లో కుళ్లిన మృతదేహం

యాడికి: మండలంలోని కుందనకోట కొండల్లో పూర్తిగా కుళ్లిపోయిన ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలను ఎస్‌ఐ గురుప్రసాదరెడ్డి వెల్లడించారు. కుందనకోట సమీపంలోని మద్దిలేటయ్య స్వామి గుడి కొండ ప్రాంతంలో సోమవారం ఉదయం గొర్రెలను మేపునకు తోలుకెళ్లిన కాపరులు... మృతదేహాన్ని గుర్తించి సమాచారం అందించడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతదేహం లభ్యమైన స్థితిని బట్టి 30 నుంచి 40 ఏళ్ల మధ్య వయసున్న పురుషుడు దాదాపు పది రోజుల క్రితం మృతి చెంది ఉంటాడని అంచనా వేశారు. నలుపు రంగు గీతలున్న నీలం రంగు ఫుల్ షర్ట్, నీలం రంగు జీన్స్ ప్యాంట్, బెల్ట్ ధరించాడు. గ్రామ వీఆర్వో కుళ్లాయప్ప ఫిర్యాదు మేరకు గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

### వివాహిత బలవన్మరణం

కంబదూరు: కడుపునొప్పి తాళలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... కంబదూరు మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన చాకలి మధు, మౌనిక (22) దంపతులకు ఏడాది వయసున్న కుమారుడు ఉన్నాడు. కొన్ని రోజులుగా కడుపునొప్పితో బాధపడుతున్న మౌనికకు కుటుంబసభ్యులు పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించారు. అయినా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి పెంచుకున్న ఆమె... సోమవారం కడుపునొప్పి భరించలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో పైకప్పుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబసభ్యుల నుంచి సమాచారం అందుకున్న ఎస్‌ఐ రాజేష్ అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.



# వైఎస్సార్‌సీపీ కార్యకర్త అనుమానాస్పద మృతి


పొలంలో పడి ఉన్న కొల్లారప్ప మృతదేహం

కళ్యాణదుర్గం: స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని ముదిగల్లు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త కొల్లారప్ప (42) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... గ్రామంలోని తన బంధువు పొలాన్ని కొల్లారప్ప కౌలుకు తీసుకుని వేరుశనగ సాగు చేపట్టాడు. ఈ క్రమంలో రోజూ పొలానికి నీటిని పెట్టేందుకు వెళ్లేవాడు. ఇందులో భాగంగానే సోమవారం ఉదయం 7.30 గంటలకు ఇంటి నుంచి పొలానికి వెళ్లిన కొల్లారప్ప ఎంత సేపటికీ ఇంటికి రాకపోవడంతో ఆయన సెల్‌ఫోన్‌కు భార్య లక్ష్మీదేవి, కుటుంబసభ్యులు కాల్ చేశారు. ఫోన్ రింగవుతున్నా లిఫ్ట్ చేయకపోవడంతో బంధువుల్లో ఆందోళన మొదలైంది. ఇంతలో పొలానికి సమీపంలో తోటలో పనిచేస్తున్న ఓ మహిళ... అపస్మారక స్థితిలో పడి ఉన్న కొల్లారప్పను గమనించి, కుటుంబసభ్యులకు సమాచారం చేరవేసింది. దీంతో హుటాహుటిన కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని చూడగా.. అప్పటికే కొల్లారప్ప మృతి చెంది ఉన్నాడు. సమాచారం అందుకున్న డీఎస్పీ బి.శ్రీనివాసులు, సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐ నాగమధు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతదేహంపై బొబ్బలు కనిపించాయి. వడదెబ్బ కారణంగా మృతి చెంది ఉంటాడని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. అయితే కంటిపై, నోటి వద్ద గాయాలు ఉండడంతో కొల్లారప్ప మృతిపై గ్రామస్తులు, కుటుంబసభ్యులు అనుమానాలు వ్యక్తం చేశారు. దీంతో అనుమానాస్పద మృతి కింద పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. కాగా, మృతుడికి ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. కొల్లారప్ప మృతి చెందిన విషయం తెలియగానే మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

# అనంతలోకి నారా లోకేష్ పాదయాత్ర


పాదయాత్ర చేస్తున్న నారా లోకేష్

అనంతపురం/బత్తలపల్లి: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర అనంతపురం జిల్లాలోకి అడుగుపెట్టింది. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం నియోజకవర్గంలో మూడు రోజుల పాటు కొనసాగిన పాదయాత్ర సోమవారం అనంతపురం రూరల్ మండలం మన్నీల వద్ద అనంతపురం జిల్లాలోకి ప్రవేశించింది. లోకేష్ బత్తలపల్లి మండలంలోని ఈదుల ముష్టూరు క్రాస్ నుంచి సంజీవపురం, యర్రాయపల్లి క్రాస్ మీదుగా మన్నీల క్రాస్‌కు చేరుకున్నారు. షెడ్యూల్ ప్రకారం ఈదుల ముష్టూరు క్రాస్‌లో రైతు ప్రతినిధులతో సమావేశం, సంజీవపురంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులతో భేటీ, యర్రాయపల్లి క్రాస్ వద్ద స్థానికులతో మాటామంతీ ఉండాలి. కానీ ఇవేమీ లేకుండానే ముందుకు సాగారు. ఎస్కే యూనివర్సిటీ వద్ద ఏఐఎస్ఎఫ్ నాయకుల నుంచి వినతి పత్రం తీసుకున్నారు. పంగల్‌రోడ్డు వద్దకు చేరుకుని అక్కడ రాత్రి బస చేశారు. ఇదిలా ఉండగా.. పాదయాత్ర ప్రారంభం దగ్గర (ఈదుల ముష్టూరు క్రాస్) కార్యకర్తలతో సెల్ఫీల కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. దానిని కవర్ చేస్తున్న మీడియా ప్రతినిధులను పాదయాత్ర వలంటీర్లు అడ్డుకోవడంతో వివాదం చెలరేగింది. దీంతో టీడీపీ నాయకులు కలుగజేసుకుని ఇరువర్గాల వారిని శాంతింపజేశారు.

## క్లుప్తంగా

### గుంతకల్లు సమాచార దీపిక విడుదల



గుంతకల్లు సమాచార దీపికను విడుదల చేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

**అనంతపురం:** కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి గుంతకల్లు సమాచార దీపికను సోమవారం విడుదల చేశారు. నూతనంగా ఏర్పాటు చేసిన గుంతకల్లు రెవెన్యూ డివిజన్‌కు సంబంధించిన ప్రాథమిక సమాచారం 'దీపిక'లో పొందుపరిచారు. త్వరితగతిన సమాచార దీపికను తయారు చేసిన ఆర్డీఓ రవీంద్ర, డివిజన్‌లోని మండల తహసీల్దార్లను కలెక్టర్ అభినందించారు.

### మృత్యుంజయ హోమం



హోమంలో కూర్చున్న వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణా రెడ్డి

**అనంతపురం:** శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం వీసీ అధికార నివాసంలో సోమవారం ఘనంగా మృత్యుంజయ హోమం నిర్వహించారు. ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణా రెడ్డి, ఆయన సతీమణి పూజలు చేసి హోమాన్ని ప్రారంభించారు. రుత్వికులు విశేష పూజలు నిర్వహించారు. వర్సిటీ అధికారులు, బోధన, బోధనేతర ఉద్యోగులు పెద్ద ఎత్తున హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించారు.

### బెస్తలు రాజకీయంగా ఎదగాలి

• బెస్త సేవా సంఘం అధ్యక్షుడు కేవీ రమణ

**అనంతపురం టవర్‌క్లాక్:** బెస్తలు ఐక్యతతో ఉండి రాజకీయంగా ఎదగాలని బెస్త సేవా సంఘం అధ్యక్షుడు కేవీ రమణ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక గంగపుత్ర కమ్యూనిటీ హాలులో బెస్త సేవా సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీ రమణ మాట్లాడుతూ ఏప్రిల్ 30 నాటికి రెండు జిల్లాల్లోని బెస్తలను సంఘంలో సభ్యులుగా చేర్చుకుంటామన్నారు. త్వరలో సంఘం తరఫున సమస్యలు పరిష్కరించడానికి చలో విజయవాడ కార్యక్రమం చేపట్టి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బాల సుబ్రమణ్యం, చంద్రబాబు, గంగప్ప, బాలన్న, నాగేంద్ర, భాస్కర్, రమేష్, తిప్పయ్య, నారాయణమూర్తి, నాగార్జున, కృష్ణ మూర్తి, శంకర్, రాజేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### ఉత్సాహంగా వనభోజనాలు



గొందిరెడ్డిపల్లి పల్లిలో వనభోజనాలకు వెళ్తున్న గ్రామస్తులు

**రాప్తాడు:** మండలంలోని గొందిరెడ్డిపల్లి, పాలచెర్ల గ్రామస్తులు సోమవారం వనభోజనాలకు వెళ్లారు. ఆయా గ్రామాల ప్రజలు ఉదయం గ్రామంలో శ్రీరామ ఆలయంలోని శ్రీరాముడి పటాన్ని తీసుకొని వనభోజనాలకు వెళ్లారు. గ్రామాల్లో చిన్నా పెద్దా తేడాలేండా వంట సామగ్రి తీసుకొని, ఇళ్లు, గుడి, బడికి తాళాలు వేసి వ్యవసాయ తోటలు, చెట్ల కిందకు వనభోజనాలకు వెళ్లారు. పిండి వంటలు చేసుకొని సాయంత్రం వరకు ప్రజలు ఉల్లాసంగా గడిపారు. మహిళలు, యువతలు ఉయ్యాల ఊగడం, యువకులు క్యారమ్స్, తొక్కుడు బిళ్ల, బారాకట్ట, వసంతోత్సవం ఆడుతూ ఆనందంగా గడిపారు. సాయంత్రం గ్రామానికి చేరుకున్న అనంతరం గడపలపై కొబ్బరి కాయలు కొట్టి ఇళ్లు, ఆలయాల తలుపులు తెరిచారు.

### నవజాత శిశువు మృతి



మృతశిశువు

**అనంతపురం సప్తగిరి సర్కిల్:** నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని శ్రేయ ఆస్పత్రిలో సోమవారం అప్పుడే పుట్టిన శిశువు మృతి చెందింది. దీంతో ఆస్పత్రి ఎదుట బాధిత కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. నగరంలోని రాంనగర్‌కు చెందిన రఫీ ఏడు నెలల గర్భిణి అయిన తన భార్య ఖుర్షీదాను శ్రేయ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. ఈనెల ఐదోతేదీ కాన్పు సమయం ఇచ్చారు.దీంతో మూడు రోజుల క్రితమే వారు ఆస్పత్రికి చేరుకున్నారు. ఆమెను పరీక్షించిన వైద్యురాలు.. ఉమ్మనీరు అధికంగా ఉందని, వెంటనే సిజేరియన్ చేయాలని చెప్పడంతో కుటుంబ సభ్యులు అంగీకరించారు. సిజేరియన్ తర్వాత శిశువు పరిస్థితి విషమంగా ఉందని, మరో ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. దీంతో వారు ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. కొద్దిసేపటికే శిశువు మృతిచెందినట్లు అక్కడి వైద్యులు నిర్ధారించారు. దీంతో ఆగ్రహానికి గురైన బాధిత కుటుంబ సభ్యులు శ్రేయ ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. ఆస్పత్రి వైద్యుల నిర్వాకం వల్లే శిశువు మృతిచెందినట్లు మండిపడ్డారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# 'అనంత' అభివృద్ధిపై సెల్ఫీ తీయండి లోకేష్



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ వసీం

**అనంతపురం క్రైం:** 'గత టీడీపీ హయాంలో అప్పటి ఎంపీ, ఎమ్మెల్యే, మేయర్ వర్గపోరుతో నగరంలో అరాచకం సృష్టించి, నాశనం చేశారు.. గొడవలు తప్ప అభివృద్ధిని పట్టించుకున్న పాపాన పోలేదు..తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత నగర రూపురేఖలు మార్చేశాం..ఇప్పుడు జరిగిన అభివృద్ధిని చూసి సెల్ఫీ తీసుకోండి లోకేష్ .. అని మేయర్ వసీం తెలిపారు. సోమవారం నగరపాలక సంస్థలోని మేయర్ చాంబర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి చొరవతో రూ.312 కోట్లతో జరుగుతున్న జాతీయ రహదారి విస్తరణ, బ్రిడ్జ్ పనులు, రాజు రోడ్డు, శారదనగర్, జేఎన్‌టీయూ రోడ్డు, గుత్తి రోడ్డు, తదితర ప్రాంతాల్లో మొత్తం కలుపుకొని రూ.800 కోట్లతో అభివృద్ధి జరుగుతోందన్నారు. రాంనగర్‌కు వెళ్లే మార్గంలో తెలుగుతల్లి విగ్రహం సమీపంలోనూ రూ.300 కోట్లతో ఎంసీహెచ్ బ్లాక్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రూ.25 కోట్ల ప్రత్యేక నిధులతో అంతర్గత రోడ్లు, కాలువల ఏర్పాటుకు చేయనున్నట్లు తెలిపారు.

**అంబేడ్కర్ బ్రిడ్జ్, క్లాక్‌టవర్ బ్రిడ్జ్ తేడా చూడండి:** టీడీపీ హయాంలో వారి అనునాయులకు లబ్ధిచేకూర్చేందుకు రాంనగర్ అంబేడ్కర్ బ్రిడ్జ్‌ను కుదించారని, దీంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారిందని మేయర్ అన్నారు. తమ ప్రభుత్వంలో నిర్మాణదశలో ఉన్న క్లాక్‌టవర్ బ్రిడ్జ్‌ను(ఫోర్‌వే) పరిశీలిస్తే మీకు కనువిప్పు కలుగుతుందన్నారు. పాదయాత్రలోనూ మైనార్టీలకు పెద్దపీట వేస్తున్నామని చెబుతున్న లోకేష్..గత టీడీపీ పాలనలో మైనార్టీలకు ఏపాటి ప్రాధాన్యత ఇచ్చారో చెప్పాలన్నారు. తమ ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే 'అనంత' చొరవతో తనకు మేయర్, ఉర్దూ అకాడమీ చైర్మన్‌గా నదీం, మార్కెట్‌యార్డు చైర్మన్‌గా ఫయాజ్, తదితరులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించిన విషయాన్ని గుర్తు చేశారు. పాదయాత్రలో సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై దుర్భాషలాడుతున్నారని, స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ నేర్పిన సంస్కారం ఇదేనా? అని మండిపడ్డారు. ఇప్పటికైనా లోకేష్ ఆత్మవిమర్శ చేసుకోవాలని, మరోసారి సీఎంపై నోరు జారితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు శ్రీనివాసులు అబూసలేహ, కమల్‌భూషణ్, నాయకులు రిజాయ్ పాల్గొన్నారు.

**అర్ధరాత్రి పింఛన్ పంపిణీ చేసిన మేయర్**

మేయర్ వసీం అర్ధరాత్రి పింఛన్ పంపిణీ చేశారు. సోమవారం 38వ డివిజన్‌లోని కోవూర్‌నగర్‌కు చెందిన లక్ష్మీదేవి (వితంతువు), పద్మావతి (ఒంటరి మహిళ)ల ఇంటికి వెళ్లి మేయర్ పింఛన్ పంపిణీ చేయడంతో లబ్ధిదారుల ఆనందానికి అవధుల్లేవు. ఈ ఏడాది ఆర్థిక సంవత్సరం కావడంతో పింఛన్ పంపిణీ మూడు రోజుల పాటు జాప్యం జరిగిందన్నారు. మంగళవారం పూర్తిస్థాయిలో పింఛన్ పంపిణీ జరుగుతుందన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు చింతకుంట మధు, ఖాజా, వెల్ఫేర్ కార్యదర్శి నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

**ఇఫ్తార్‌లో పాల్గొన్న మేయర్**

**అనంతపురం సప్తగిరి సర్కిల్:** నగరంలోని ఈద్గా మసీదులో సోమవారం జరిగిన ఇఫ్తార్‌లో నగర మేయర్ వసీం హాజరయ్యారు. రంజాన్ మాసం ప్రారంభమై నేటికి 11 రోజులు పూర్తయిన సందర్భంగా ఆయన ఉపవాసం ఉన్నవారికిధన్యవాదాలు తెలియజేశారు.

## రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే పాదయాత్ర అడ్డుకుంటాం



మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి

**అనంతపురం క్రైం:** 'యువగళం పేరిట టీడీపీ నాయకుడు లోకేష్ చేస్తున్న పాదయాత్ర అంతా గందరగోళమే.. ఓ విధానం అంటూ లేకుండా...అధికారంలోకొస్తే ఏం చేస్తారో చెప్పకుండా ముందుకు సాగుతున్నారని.. ప్రతి చోటా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే పాదయాత్ర అడ్డుకుంటామని' డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి అన్నారు. సోమవారం డిప్యూటీ మేయర్ క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్రం సస్యశ్యామలంగా ఉందన్నారు. అర్హతే ప్రామాణికంగా అవినీతి రహిత పాలన జరుగుతోందన్నారు. ఇటీవల జిల్లాలోని పుట్టపర్తి ప్రాంతంలో లోకేష్ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసి, ఆందోళనకరమైన వాతావరణం సృష్టించారన్నారు. నగరంలో జరిగిన రూ.వందల కోట్ల అభివృద్ధిపైనే అడుగులు వేసుకుంటూ వెళ్లే లోకేష్..అభివృద్ధిని ఓ సారి కళ్లు తెరచి చూడాలని ఆయన హితవుపలికారు. సమావేశంలో కార్పొరేటర్లు లాలు, బాబాఫకృద్దీన్, అబూసలేహా, తదితరులు పాల్గొన్నారు.

**లోకేష్‌ను నిలదీయండి**

పాదయాత్ర పేరుతో నయవంచన చేయడానికి వస్తున్న టీడీపీ నాయకుడు నారా లోకేష్, టీడీపీ నాయకులను నిలదీయాలని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నేత పెన్నోబులేసు ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్సీలకు టీడీపీ ఏ పాటి ప్రాధాన్యత ఇచ్చిందో అందరికీ తెలుసన్నారు. గతంలో టీడీపీ అధినేత చంద్రబాబు ఎస్సీలను ఏవిధంగా విమర్శించారో అందరికీ తెలుసన్నారు. టీడీపీ పాలనలో జిల్లాలో ఎస్సీ,ఎస్టీల మాన ప్రాణాలను అపహరించి, భూములు లాక్కున్నారన్నారు. ఇప్పుడు మరోసారి అధికారం కోసం టీడీపీ నేత నారా లోకేష్ నక్క వినయం ప్రదర్శిస్తున్నారన్నారు. యువగళం పేరుతో చేస్తున్న లోకేష్ పాదయాత్ర అట్టర్‌ఫ్లాప్ అయ్యిందని, రూ.కోట్లు కుమ్మరిస్తూ, పెయిడ్ ఆర్టిస్టులతో పాదయాత్రకు జనాలను తరలిస్తున్నారన్నారు.

## నీటి కనెక్షన్లు పక్కాగా చేయించాలి

**అనంతపురం క్రైం:** ఏపీఎండీపీ పైప్‌లైన్ ప్రాజెక్ట్‌లో మిగిలిపోయిన పనులకు ఎలాంటి సమస్య తలెత్తకుండా నీటి సర్వీస్ కనెక్షన్లను పక్కాగా చేయించాలని కమిషనర్ రమణారెడ్డి డీఈ నరసింహ, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. సోమవారం ఉదయం పైప్‌లైన్ పనులను ఆయన పరిశీలించారు. రోడ్డు గుంతలు తీసే క్రమంలో కింద వైపు పైప్‌లైన్ కనెక్షన్లున్నాయో లేదో తెలుసుకొని ప్రణాళికతో చేయించాలన్నారు. అనంతరం ఆ ప్రాంతంలో పారిశుధ్యం మెరుగునకు తీసుకోవాల్సిన చర్యలపై ఎంహెచ్‌ఓ డాక్టర్ గంగాధర్ రెడ్డికి సూచనల, సలహాలు అందించారు. అనంతరం కమిషనర్ రాచానపల్లి లే అవుట్‌ను పరిశీలించారు. నిర్మాణ పనులు సాధ్యమైనంత త్వరగా ప్రారంభించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ నెల 5లోపు సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. ఈ నెల 6న నిర్మాణ పనులు ప్రారంభించాలన్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాచానపల్లి లేఅవుట్‌లో 205 ప్లాట్లున్నాయని, అందులో 160 మంది లబ్ధిదారులున్నట్లు తెలిపారు. డిప్యూటీ కమిషనర్ సావిత్రి, తదితరులు పాల్గొన్నారు.

**వంకల్లో పూడిక తొలగించాలి**

మరువవంక, నడిమి వంకల్లోని పూడికను తొలగించేలా చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ అధికారులను డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి ఆదేశించారు. సోమవారం నగరంలోని మరువవంకలో పేరుకుపోయిన ప్లాస్టిక్, తదితర వ్యర్థాలను తొలగించేలా డిప్యూటీ మేయర్ చర్యలు తీసుకున్నారు. కాలువలు, కల్వర్టుల్లో అడ్డంగా వేసిన పైపులను తొలగించాలన్నారు.

**స్పందనలో 12 ఫిర్యాదులు**

నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలో సోమవారం జరిగిన స్పందనలో 12 వినతులు వచ్చాయి. డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య ఫిర్యాదులు స్వీకరించారు. సాధ్యమైనంత త్వరగా స్పందన వినతులకు పరిష్కారం చూపాలని డిప్యూటీ కమిషనర్ సావిత్రిని వారు ఆదేశించారు.

### యంత్ర నిర్వహణపై అవగాహన



సావనీర్ ఆవిష్కరిస్తున్న రెక్టార్ మల్లికార్జున రెడ్డి

**అనంతపురం:** జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాలలోని మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో యాంత్రిక స్థితి పనితీరు లోప నిర్వహణ (కండీషన్ మానిటరింగ్) అంశంపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. నిట్ వరంగల్ ప్రొఫెసర్ , జేఎన్‌టీయూ అనంతపురం పూర్వ విద్యార్థి డాక్టర్ వి. సురేష్‌బాబు ఆధునిక యంత్రాలను ఎలా పరీక్షించాలి? అనే అంశంపై వివరించారు. మెకానికల్ రంగంలో ఉన్నత ప్రమాణాలు, పరిశోధన అంశాలు, ఉద్యోగ అవకాశాలు గురించి వివరించారు.మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ కళ్యాణి రాధ, కోఆర్డినేటర్ డాక్టర్ బి. ఓంప్రకాష్, రీసెర్చ్ స్కాలర్ ఇస్మాయిల్ పాల్గొన్నారు.

**జాతీయ సైన్సు సదస్సు ప్రారంభం**

**అనంతపురం:** శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని కంప్యూటర్ సైన్స్ విభాగంలో రెండు రోజుల పాటు జరిగే జాతీయ సదస్సు సోమవారం ప్రారంభమైంది. కార్యక్రమానికి రెక్టార్ ప్రొఫెసర్ ఏ.మల్లికార్జున రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పరిశ్రమల అవసరాలకు దీటుగా నైపుణ్యాలు పెంపొందిస్తేనే, సాఫ్ట్‌వేర్ రంగంలో రాణిస్తారన్నారు. సాఫ్ట్‌వేర్ దిగ్గజాలు అయిన సత్యానాదేళ్ల, సుందర్‌పిచాయ్ తదితర ప్రముఖులను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర పాల్గొన్నారు.

## సంక్షిప్త సమాచారం

**రెండోరోజూ సాఫ్ట్‌బాల్ జట్టు ఎంపికలు**

**అనంతపురం సప్తగిరి సర్కిల్:** భారత సాఫ్ట్‌బాల్ పురుషుల విభాగం జూనియర్, సీనియర్ జట్ల ఎంపికలు సోమవారం జరిగాయి. జపాన్‌లో ఈ ఏడాది జూన్ 21 నుంచి 23 వరకు జూనియర్ విభాగం, 24 నుంచి 27 వరకు సీనియర్ విభాగాలలో ఏషియా స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు నిర్వహించనున్నారు. భారత జట్టు ఎంపిక ప్రక్రియ కొనసాగింది. అత్యుత్తమ క్రీడాకారులను ఎంపిక చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని భారత సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సీఈఓ ప్రవీణ్ అనౌకర్, రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సీఈఓ వెంకటేశులు తెలిపారు.

**సజావుగా వలంటీర్ల ఇంటర్వ్యూలు**

**ఆత్మకూరు:** స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వలంటీర్ పోస్టులకు సోమవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. సనప గ్రామంలో రెండు పోస్టులు, ముట్టాల ఒకటి, గొరిదిండ్ల ఒకటి మొత్తం నాలుగు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ముట్టాల ఒకరు, గొరిదిండ్ల ఒకరిని ఎంపిక చేసినట్లు ఎంపీడీఓ విజయ్ ప్రసాద్ తెలియచేశారు. సనప పంచాయతీలో రెండు పోస్టులు ఉండగా, దరఖాస్తులు చేసుకోలేదు. ఈవోఆర్డీ సత్యబాబు, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్ పాల్గొన్నారు.

**వెయిట్ లిఫ్టింగ్ జాయింట్ సెక్రటరీగా జగదీష్**

**అనంతపురం సప్తగిరి సర్కిల్:** ఆంధ్రప్రదేశ్ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరిగా అనంతపురం జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు జగదీష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏలూరులోని శ్రీ హోటల్‌లో జాతీయ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఆనంద్‌గౌడ్ నేతృత్వంలో నిర్వహించారు. రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా ఏకగ్రీవంగా ఎన్నికై నందుకు ఆయనకు జిల్లా అసోసియేషన్ కార్యదర్శి పవన్‌కుమార్, చైర్మన్ శివయ్య, ట్రెజరర్ సురేష్, పీడీ నాగారాజులు ప్రత్యేకంగా అభినందించారు.

**ఆవోపా సంస్కార సాధన క్యాంపు**

**అనంతపురం కల్చరల్:** వేసవి సెలవులలో ఆవోపా (ఆర్యవైశ్య అఫీషియల్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్) ద్వారా 5వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఉచితంగా సంస్కార సాధన క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఆవోపా జిల్లా అధ్యక్షుడు జయంతి శ్రీనివాసుల శెట్టి తెలిపారు. ఈ మేరకు ఆవోపా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 4 నుంచి 24వ వరకు స్థానిక రాజు రోడ్డులోని వైశ్యాహాస్టల్ ప్రాంగణంలోని ఆవోపా కార్యాలయంలో రిజిస్ట్రేషన్స్ ఉంటాయన్నారు. మే 4 నుంచి 13 వరకు సంస్కార సాధన క్యాంపు ఉంటుందన్నారు.

**తబలా వాయిద్యకారుడు శ్రీనివాసరాయుడు మృతి**

**అనంతపురం కల్చరల్:** తబలా వాయిద్యానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చిన అడవాల శ్రీనివాసరాయుడు (78) సోమవారం మృతిచెందాడు. చిన్నవయసులో పోలీసు డిపార్టుమెంటులో చేరినా ఆయన ప్రవృత్తి రీత్యా కళాకారుడు కావడంతో తబలా వాయిద్యంలో అనేక ప్రయోగాలు చేసి, ఎన్నో అవార్డులు,రివార్డులందుకున్నారు. ఆయన అంత్యక్రియల్లో పాల్గొన్న ఏపీ నాటక అకాడమీ చైర్‌పర్సన్ రాగే హరిత, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చామలూరు రాజగోపాల్ తదితరులు మాట్లాడారు. శ్రీనివాస రాయుడుకు భార్య ఇద్దరు కూతుళ్లు, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆయన సోదరుడు శేషగిరి రాయుడు కూడా స్వరలయ శిక్షణాలయం నడుపుతున్నాడు.

**వన్ ర్యాంక్ వన్ పెన్షన్ లోపాలు సరిదిద్దండి**

**అనంతపురం శ్రీకంఠంసర్కిల్:** వన్‌ర్యాంక్ వన్ పెన్షన్ లోపాలను సరిదిద్దాలని జిల్లా మాజీ సైనిక సంఘం అధ్యక్షుడు విశ్వేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం సంఘం ఆధ్వర్యంలో స్థానిక టవర్‌క్లాక్ వద్ద సంఘీభావం తెలిపారు. ఆయన మాట్లాడుతూ మాజీ సైనికులకు వన్ ర్యాంక్ వన్ పెన్షన్ ద్వారా సవరణల విధానంలో బేసిక్‌పే, మిల్ట్రీ పే అలవెన్సుల్లో తేడా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి ఐదేళ్లకోసారి పే రివిజన్ చేస్తామని మాట ఇచ్చి తప్పిందన్నారు.

## పరీక్షలు లేని రోజుల్లో మినహాయింపు ఇవ్వాలి

**రాప్తాడురూరల్:** పదో తరగతి పరీక్షల విధుల్లో పాల్గొంటున్న సీఎస్, డీఓలు, ఇన్విజిలేటర్లకు పరీక్షలు లేని రోజుల్లో పాఠశాలలకు వెళ్లాలనే ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేసి, ఆరోజుల్లో విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం డీఈఓ సాయిరామ్‌ను కలిసి వినతిపత్రం అందించారు. డీఈఓను కలిసిన వారిలో సంఘం అధ్యక్షుడు జి.రవీంద్ర, ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాసరెడ్డి, నాయకులు శ్రీనివాస్ నాయక్, నాగరాజు, అంకిరెడ్డి, ఫకృద్దీన్, గోవిందరెడ్డి, నరసింహులు ఉన్నారు.

**ఆ మూడు రోజులూ స్కూళ్లకు వెళ్లాల్సిందే:** పదో తరగతి పరీక్షల షెడ్యూలులో మూడు రోజులు (4,11,12 తేదీలు) పరీక్షలు ఉండవని, ఈరోజుల్లో సీఎస్‌లు, డీఓలు, ఇన్విజిలేటర్లు కచ్చితంగా స్కూళ్లకు వెళ్లాల్సిందేనని జిల్లా విద్యాశాఖ అధికారి సాయిరామ్ స్పష్టం చేశారు. సోమవారం ఆయనను కలిసిన ఉపాధ్యాయులతో మాట్లాడారు. పరీక్షలు లేని ఆ మూడు రోజులు అటెండెన్స్‌కు ఇబ్బందిగా ఉంటుందని, పాఠశాలలకు వెళ్లాలని సూచించారు.

## ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు



అంధ విద్యార్థులు రాస్తున్న పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఈఓ సాయిరాం

**రాప్తాడు/ఆత్మకూరు:** రాప్తాడు మండలంలో ఐదు సెంటర్లలో పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మొదటి రోజు పరీక్షకు 1,101 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 1,094 మంది హాజరయ్యారు. ఏడుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారని చీఫ్, డిపార్ట్ మెంటల్ అధికారులు, ఎంఈవో మల్లికార్జున తెలిపారు. ఏపీ మోడల్ స్కూల్‌లో ఇద్దరు, రాప్తాడు జెడ్పీహెచ్‌ఎస్‌లో ముగ్గురు, ఎల్లార్జీ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో ఒకరు, ఆర్డీటీ అంధుల పాఠశాలలో ఒకరు గైర్హాజరయ్యారు. సెంటర్ల వద్ద విద్యార్థులను మాత్రమే అనుమతించారని, విద్యార్థుల తల్లిదండ్రులు అధికారులు, పోలీసులతో వాగ్వాదానికి దిగారు. మొదటిరోజు హాల్‌టికెట్ నంబర్లు చూసుకోవడానికి అనుమతించాలని కోరారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. ఆయా కేంద్రాలను మొదటి రోజు డీఈఓ సాయిరాం, స్క్వాడ్ టీంలు పర్యవేక్షించారు.

**పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన డీఈఓ**

**రాప్తాడు:** రాప్తాడు జెడ్పీహెచ్‌ఎస్‌లో జరుగుతున్న పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని సోమవారం డీఈఓ సాయిరాం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆర్డీటీ అంధుల పాఠశాలకు చెందిన ఆరుగురు అంధ విద్యార్థినులు సహాయకులు లేకుండా ల్యాప్ టాప్ సాయంతో డిజిటల్ విధానంలో రాస్తున్న పరీక్షను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా రాప్తాడు జెడ్పీహెచ్‌ఎస్‌లో ల్యాప్ టాప్‌లో పరీక్షలు రాయడం గొప్ప విషయమన్నారు.

**ఆత్మకూరు** మండల కేంద్రంలో పదోతరగతి పబ్లిక్ పరీక్షలకు మూడు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆత్మకూరు ఉన్నత పాఠశాలలో 252 మంది , ఆత్మకూరు కేజీబీవీలో 190 మంది, హోలిస్పిరిట్ ప్రైవేట్ పాఠశాలలో 298 మంది హాజరయ్యారు. ఆరుగురు గైర్హాజరయినట్లు ఎంఈఓ నరసింహారెడ్డి తెలిపారు.

## గరుడ వాహనంపై కోదండరాముడు



**అనంతపురం కల్చరల్:** నగరంలోని మొదటిరోడ్డు కోదండ రామాలయంలో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు భక్తిభావాన్ని నింపుతున్నాయి. సోమవారం సాయంత్రం సీతారాములు శ్రీమహావిష్ణువు అలంకరణలో గరుడ వాహనంపై విహరించి, భక్తులకు దర్శనమిచ్చారు. రెండోరోడ్డు, మూడో రోడ్డుల మీదుగా ఆలయం చేరుకున్న వాహన సేవలకు భక్తులు భక్తినీరాజనాలర్పించారు. అంతకు ముందు ఆలయంలో మూలమూర్తులకు ప్రత్యేక అభిషేకాలు, అలంకార సేవలు జరిగాయి.

### ఉత్తమ అధికారిని కోల్పోయాం



శ్రీనివాసరావు మృతదేహానికి నివాళి అర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

**అనంతపురం సిటీ:** ఉత్తమ అధికారి శ్రీనివాసరావును కోల్పోయామని, ఆయన మృతి తీరని లోటని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. పామిడి ఎంపీడీఓ కార్యాలయ ఏఓగా పనిచేస్తున్న శ్రీనివాసరావు హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతదేహాన్ని అనంతపురం తీసుకొచ్చారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, సీఈఓ భాస్కర్‌రెడ్డి, డిప్యూటీ సీఈఓ జిల్లా శ్రీనివాసులు, జెడ్పీ అధికారులు, సిబ్బంది సోమవారం ఉదయమే మూడో రోడ్డులోని శ్రీనివాసరావు ఇంటికెళ్లారు. మృతదేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు.

### సర్దుబాటు పేరుతో దోపిడీ

**అనంతపురం సిటీ:** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సర్దుబాటు పేరుతో విద్యుత్ చార్జీలను పెంచడం దారుణమని సీపీఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ సోమవారం విమర్శించారు. ఇదో రకమైన దోపిడీ అంటూ ఆయన నిప్పులు చెరిగారు. విద్యుత్ చార్జీలు పెంచేది లేదంటూ ఒక వైపున ప్రకటిస్తూనే, మరోవైపు సర్దుబాటు పేరుతో రాష్ట్రంలో ప్రతి నెలా విద్యుత్ యూనిట్‌కు 0.40 పైసలు చొప్పున అదనంగా వసూలు చేయాలని బీజేపీ ప్రభుత్వం ఆదేశించడం దుర్మార్గమైన చర్యగా ఆయన అభివర్ణించారు. ప్రతి నెలా అదనపు చార్జీ వసూలు చేయడమే గాక ఏడాది చివరలో మళ్లీ అదనపు సర్దుబాటు భారం మోపేందుకు బీజేపీ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని దుయ్యబట్టారు.

### సెంట్రల్ పార్క్ స్థలం సర్వే

**అనంతపురం క్రైం:** రూ.వందల కోట్లు విలువ చేసే సెంట్రల్ పార్క్ స్థలాన్ని అధికారులు సర్వే చేయించారు. సోమవారం ఏసీపీ సువర్ణ, సర్వేయర్ ప్రభాకర్, సచివాలయ పట్టణ ప్రణాళిక కార్యదర్శులు బస్టాండ్ సమీపంలోని రాజహంస వెనుకవైపున్న సెంట్రల్ పార్క్ స్థలాన్ని రోవర్ సహాయంతో సర్వే చేయించారు. సర్వే నంబర్ 174లోని 4.61 ఎకరాల స్థలానికి సంబంధించి బౌండరీలు ఏర్పాటు చేశారు. ఈ స్థలానికి సంబంధించి మొత్తం 12 సర్వే నంబర్లు ఉన్నాయన్నారు. ఇదిలా ఉండగా ఇటీవల కౌన్సిల్ సమావేశంలో 7వ డివిజన్ కార్పొరేటర్ బండి నాగమణి 6.5 ఎకరాల సెంట్రల్ పార్క్ స్థలం సర్వే చేయాలని డిమాండ్‌చేసిన విషయం విదితమే.

### వ్యక్తిపై కత్తితో దాడి

**అనంతపురం శ్రీకంఠంసర్కిల్:** నగరంలోని త్రివేణి టాకీస్ సమీపంలో దాడి జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు... వేణుగోపాలనగర్‌లో నివాసం ఉంటున్న తాడిపత్రి రామాంజినేయులు, అవుకు సుబ్బారెడ్డి స్నేహితులు. శ్రీరామనవమి పండుగ రోజున త్రివేణి థియేటర్ ఎదురుగా టీస్టాల్ వద్ద గొడవపడ్డారు. ఆదివారం రాత్రి త్రివేణి టాకీస్ పక్క వీధిలో నడిచి వెళ్తుండగా భాస్కర్‌ను రామాంజినేయులు, సుబ్బారెడ్డి గుర్తించి, కాయగూరల కత్తితో దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన భాస్కర్ వారి బారి నుంచి తప్పించుకుని నేరుగా ప్రభుత్వాస్పత్రికి చేరుకున్నాడు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.




**టీ–20 విజేత కిమ్స్ సవీరా జట్టు**

**అనంతపురం సప్తగిరి సర్కిల్:** నగర శివారులోని తపోవనం క్రికెట్ అకాడమీ మైదానంలో సోమవారం నిర్వహించిన ఫైనల్ మ్యాచ్‌లో కిమ్స్ సవీరా జట్టు, డీఎంహెచ్‌ఓ జట్లు తలపడ్డాయి. తొలుత బ్యాటింగ్ చేసిన డీఎంహెచ్‌ఓ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 127 పరుగులకు ఆలౌటైంది. అనంతరం బ్యాటింగ్ చేసిన కిమ్స్ సవీరా జట్టు 9.5 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి, విజయం సాధించింది.







## ట్రాఫిక్ 'పరీక్ష'పాస్ కావాల్సిందే!

పదోతరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. సమయానికి కేంద్రానికి చేరుకోవాలని విద్యార్థులకు ఓ వైపు టెన్షన్, మరో వైపు మొదటిరోజు ఆత్రుత నెలకొంది. ఇదే సమయంలో నగరంలో పలుచోట్ల ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారింది. గందరగోళాన్ని దాటి కేంద్రానికి సకాలంలో చేరుకోవాలంటే ' ట్రాఫిక్ పరీక్ష పాస్' కావాల్సిందేనని విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అనిపించింది. పాతూరు నంబర్ 2 పాఠశాల వద్ద ఈ పరిస్థితి కనిపించింది. వాహనదారులు కూడా ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేయడంతో విద్యార్థులు అవస్థలు పడాల్సి వచ్చింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం :